సాక్షి
వికారాబాద్
మంగళవారం । 15 । జూలై । 2025



ఫోన్ చోరీ.. ఖాతా ఖాళీ

బస్సులు, సంతల్లో ఫోన్లను చోరీ చేయడం ఆపై డబ్బులు కొట్టేయడం సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న కొత్త విధానం. 8లో▸



పర్యవేక్షణే పరమావధి

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ బాగున్నా అమలులో ఇబ్బందులు తప్పడం లేదు. 8లో▸



పశుపోషకులకు 'షాక్'

పొలాల్లో రక్షణలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా కరెంట్ షాక్‌కు గురై మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

నేడు ధారూరుకు స్పీకర్ రాక

ధారూరు: మండల కేంద్రమైన ధారూరుకు మంగళవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ రానున్నట్లు ఎంపీడీఓ నర్సింహులు తెలిపారు. అన్ని శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులు మండల సమాచారంతో సకాలంలో హాజరు కావాలన్నారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

అనంతగిరి: స్వయం ఉపాధి రుణాల కోసం అర్హులైన దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ లింకేజీతో సంబంధం లేకుండా నేరుగా రూ.50 వేలు(22 యూనిట్లు), లింకేజీతో రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు మూడు యూనిట్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. 2025 –26 ఆర్థిక సంవత్సరానికి గాను ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈనెల 14 నుంచి 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు కనీస వైకల్యం 40శాతం పైబడి ఉండాలన్నారు. 21 నుంచి 55 ఏళ్ల లోపు వారు అర్హులని, వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు ఉండాలని తెలిపారు. గత ఐదేళ్లలో ఈ పథకం కింద లబ్ధి పొందకుండా ఉండాలన్నారు. సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఇటీవల తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రం, కులం, నివాస ధ్రువీకరణ పత్రం, వయస్సు నిర్ధారణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్ ఫొటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మత్తు పదార్థాలు కలపొద్దు

జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్‌భాస్కర్



వికారాబాద్‌లోని కల్లు డిపోను పరిశీలిస్తున్న విజయ్‌భాస్కర్, తదితరులు

అనంతగిరి: కల్లులో మత్తు పదార్థాలు వాడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్‌భాస్కర్ హెచ్చరించారు. సోమవారం వికారాబాద్‌లోని కల్లు డిపోను పరిశీలించారు. కల్లులో సీహెచ్ లేదన్నారు. అయినా పరీక్షల నిమిత్తం శాంపిల్స్ సేకరించి నగరంలోని నారాయణగూడ ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. వర్షాలు పడుతున్నందున పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కల్లు సీసాలు శుభ్రంగా ఉంచాలన్నారు. పరిశుభ్రమైన కల్లును ప్రజలకు అందించాలని ఆదేశించారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించండి



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు

అనంతగిరి: ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 126 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు సమయపాలన పాటించాలన్నారు. ప్రజావాణి అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్షచౌదరి, ఆర్డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కళాశాలను అభివృద్ధి చేయండి

షాద్‌నగర్: ఇంటర్మీడియెట్ విద్యామండలి కమిషనర్ కృష్ణ ఆదిత్యను సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామస్తులు కలిశారు. ప్రొఫెసర్ హరగోపాల్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన శ్యాంసుందర్, మల్లేష్ కమిషనర్‌ను కలిసి మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కోసం వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రామంలో పర్యటించినప్పుడు కళాశాల అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభించాలని, సివిక్స్ పోస్టు ఖాళీగా ఉందని గెస్టు లెక్చరర్‌ను నియమించాలని, విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, టెలివిజన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన కమిషనర్ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కమలంలో విభేదాలు

బీజేపీలో రోజురోజుకూ పెరుగుతున్న గ్రూపుల లొల్లి

- కొత్త అధ్యక్షుడికి సవాల్‌గా మారిన అంతర్గత కుమ్ములాటలు
- ఫలించని కొండా జోక్యం
- జిల్లా బాస్ ఒంటెత్తు పోకడను నిరసిస్తున్న స్థానిక కేడర్



వికారాబాద్: బీజేపీలో అంతర్గత విభేదాలు, గ్రూపు రాజకీయాలు తలనొప్పిగా మారాయి. ఇప్పుడిప్పుడే ఓటు బ్యాంక్ పెరుగుతున్న నేపథ్యంలో నేతల మధ్య కుమ్ములాటలు పార్టీ ఎదుగుదలకు అవరోధంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ పోరు నాటికి జిల్లాలో పార్టీ ఓటు బ్యాంక్ గణనీయంగా పెరిగింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి జిల్లాలో బీజేపీ సైతం బలమైన శక్తిగా మారే అవకాశం లేకపోలేదు. కానీ వర్గపోరు కమల వికాసానికి గొడ్డలిపెట్టుగా మారుతోంది. చాలా కాలంగా గ్రూపు తగాదాలు ఉండగా మూడు నెలల క్రితం జిల్లా కొత్త అధ్యక్షుడి నియామకంతో ముదిరి పాకాన పడ్డాయి. స్థానికేతరుడైన వ్యక్తిని జిల్లా బాస్‌గా నియమించడంపై ముఖ్యనేతలు గుర్రుగా ఉన్నారు. ఈ అధ్యక్షుడు మాకొద్దంటూ అప్పట్లో అధిష్టానానికి ఫిర్యాదు కూడా చేశారు. పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని సంకేతాలు రావడంతో తగ్గారు. తాజాగా పార్టీ సంస్థాగత ఎన్నికలు జరుగుతున్న సమయంలో వర్గపోరు మళ్లీ గుప్పుమంది. అది కాస్త నేతలు బాహాటంగానే ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే స్థాయికి వెళ్లింది.

కొత్త అధ్యక్షుడి తీరుపై అసంతృప్తి

రాజశేఖర్ రెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నియమించటానికి ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి దీవెనలే కారణమనే ప్రచారం జరుగుతోంది. ఆయన గట్టిగా సపోర్టు చేయడం వల్లే జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు సమాచారం. రాజశేఖర్‌రెడ్డి నిలదొక్కుకోవడానికి ఎంపీ సహకరిస్తూ వస్తున్నారు. అయితే కొత్త అధ్యక్షుడి నియామకంపై కొంత కాలంగా చర్చ జరుగుతూ వస్తోంది. ఈ పదవి కోసం పలువురు సీనియర్లు, జూనియర్లు పోటీ పడగా వారందరిని పక్కన పెట్టి స్థానికేతరుడైన రాజశేఖర్‌రెడ్డికి పార్టీ పగ్గాలు కట్టబెట్టారు. దీంతో ఆశావహులతో పాటు పలువురు నేతల్లో అసంతృప్తి నెలకొంది. ఆయన అభ్యర్థిత్వాన్ని తొలగించాలని ఎన్నికల అధికారిని కలిసి ఫిర్యాదు కూడా చేశారు. మండల అధ్యక్షుడిగా నియమించాలన్నా కనీసం మూడు సార్లు పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొనటంతో పాటు స్థానికుడు అయి ఉండాలనే నిబంధన ఉంది. దీన్ని బేఖాతరు చూస్తూ ఏడాది క్రితం పార్టీలోకి వచ్చిన వ్యక్తికి పార్టీ పగ్గాలు ఎలా కట్టబెడతారని స్థానిక నేతలు ప్రశ్నిస్తున్నారు.

పురుడుపోసుకున్న మరిన్ని గ్రూపులు

జిల్లాలో గ్రూపు రాజకీయాలు తలనొప్పిగా మారిన తరుణంలో కొత్త అధ్యక్షుడి రాకతో మరిన్ని గ్రూపులు పురుడుపోసుకున్నాయి. పార్టీలో గ్రూపులున్నాయనే విషయం ఇటీవల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నోటినుంచే రావటం జిల్లాలో చర్చనీయాంశం అయ్యింది. కొన్ని రోజుల క్రితం పార్టీ మండల అధ్యక్షులు, ఇతర కార్యవర్గాన్ని నియమించారు. స్థానిక నేతలనే నియమించి అధ్యక్షుడితో ఆమోద ముద్ర వేయించారు. వికారాబాద్ పట్టణ, మండల అధ్యక్షుల నియామకంలో ఈ సంస్కృతిని పక్కన పెట్టి జిల్లా అధ్యక్షుడు జోక్యం చేసుకోవడంతో ఎవరికి వారు రెండు కార్యవర్గాలను ఏర్పాటు చేసుకున్నారు. వికారాబాద్ మండలం దన్నారంలో జరిగిన పార్టీ సమావేశంలో జిల్లా అధ్యక్షుడి వైఖరిని ఓ సీనియర్ కార్యకర్త నిలదీయగా అధ్యక్షుడు దురుసుగా మాట్లాడటం కేడర్‌లో తీవ్ర అసంతృప్తికి ఆజ్యం పోసింది. పార్టీ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవానికి స్థానిక నాయకులకు ఆహ్వానం లేకపోవడం మరో వివాదానికి కారణమైంది. ఈ విషయంలో పలుసార్లు ఎంపీ కొండా కలుగజేసుకొని వివాదం పరిష్కరించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

ఏకతాటిపైకి తెచ్చేందుకు..

ఓటు బ్యాంక్ అనేక రెట్లు పెరుగుతున్న తరుణంలో నేతల మధ్య అంతర్గత కుమ్ములాటలు పార్టీకి చెడ్డపేరు తెస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఎలాగైన పార్టీని పూర్తిస్థాయిలో బలోపేతం చేయాలనే లక్ష్యంతో సాగుతున్న వారు నేతలందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు పావులు కదుపుతున్నారు. ఈ విషయమై పరిగికి చెందిన పార్టీ సిద్ధాంత కర్త, మరికొందరు జిల్లా నేతలతో మంతనాలు జరుపుతున్నట్టు సమాచారం. అయితే వారి ప్రయత్నాలకు కొందరు విఘాతం కలిగిస్తుండటం పార్టీ అభిమానులకు ఆగ్రహం తెప్పిస్తోంది.

'పాంబండ'ను అభివృద్ధి చేస్తాం

- దశలవారీగా నిధులు కేటాయిస్తాం
- దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న మంత్రి కొండా సురేఖ

పరిగి/కుల్కచర్ల: రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. కుల్కచర్ల మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలో వెలసిన పాంబండ రామలింగేశ్వర స్వామిని సోమవారం ఎమ్మెల్యే టీ.రామ్మోహన్ రెడ్డితో కలిసి దర్శించుకున్నారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో స్థానికుల వాటా పది శాతం ఉంటేనే ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించేదని, ఇప్పుడు దేవాదాయ శాఖే మొత్తం నిధులు ఇస్తోందన్నారు. పాంబండ ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. దశలవారీగా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఆలయ అభివృద్ధికి రూ.80 కోట్లు మంజూరు చేయాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్, డీఎస్పీ శ్రీనివాస్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ, డైరెక్టర్ భరత్‌కుమార్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, వైస్ చైర్మన్ నాగరాజు, బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్‌కుమార్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రెడ్డి, చౌడాపూర్, మహ్మదాబాద్ మండలాల అధ్యక్షులు అశోక్‌కుమార్, నారాయణ, కుల్కచర్ల మండల యువజన విభాగం అధ్యక్షుడు జంగయ్య పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి రూ.1.60 కోట్లు

ఇటీవల సరస్వతీ పుష్కరాలను ఎంతో ఘనంగా నిర్వహించామని వచ్చే రెండు పుష్కరాలను కూడా విజయవంతం చేస్తామని మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం పరిగి పట్టణంలో రూ.20 లక్షలతో నిర్మించిన మైసమ్మ ఆలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి రూ.1.60 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి పవిత్రోత్సవాలు

- ముస్తాబవుతున్న కొడంగల్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం



మూలమూర్తి

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఈ నెల 19వ తేదీ నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆలయ పవిత్రతతో పాటు పట్టణ పురోగతి కోసం ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆలయ ధర్మకర్త నందారం శ్రీనివాస్ పేర్కొన్నారు. రెండేళ్లకు ఒక్కసారి జరిగే ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు పాల్గొంటారని తెలిపారు. తిరుమల తరహాలోనే వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహిస్తారని చెప్పారు. శ్రీవారి ఆలయంలో నిత్యం జరిగే కైంకర్యాలు, ధూప దీప నివేదనలో ఏమైనా పొరపాటు జరిగితే మంత్ర లోపం, ద్రవ్యలోపం, క్రియా లోపం వలన కలుగు దోషములు తొలగిపోతాయన్నారు. 19వ తేదీ రాత్రి 7గంటల నుంచి ఆచార్య వచణం, సేనాధిపతి ఉత్సవం, మత్సం గ్రహణం, అంకురార్పణ, వేదారంభం, 20వ తేదీ ఉదయం 9గంటలకు ఉత్సవ మూర్తులకు శత కళశ తిరుమంజనం, మధ్యాహ్నం 12గంటలకు అగ్ని ప్రతిష్ఠ, విశేష హోమాలు, పవిత్ర ప్రతిష్ఠ, రాత్రి 7గంటలకు కుంభవాహన, విశేష హోమాలు, 21వ తేదీ ఉదయం 9గంటలకు విశేష ఉక్త హోమాలు, పవిత్ర సమర్పణ, రాత్రి 8గంటలకు విశేష హోమాలు, 22వ తేదీ ఉదయం 9గంటలకు విశేష హోమాలతో పాటు పవిత్రోత్సవం, అష్టోత్ర శత అష్టదళ పద్మారాధన, పవిత్రోత్సవ మహా పూర్ణాహుతి, రాత్రి 7 గంటలకు కుంభ బింబ ప్రదక్షిణం, ప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వానిది రియల్ వ్యాపారం



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

- పేదలు సాగుచేసుకునే భూములు లాక్కుంటున్నారు
- ఎనికేపల్లి రైతులకు అండగా ఉంటాం
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

మొయినాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా మారిందని మల్కాజిగిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్ విమర్శించారు. మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లి భూములను గోశాలకు ఇవ్వొద్దంటూ రైతులు చేస్తున్న రిలే దీక్షకు సోమవారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే పేదలకిచ్చిన అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పుడు పేదల భూములు గుంజుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. కోకాపేటలో ఉన్న గోశాలను ఎనికేపల్లికి తరలించి అక్కడ ఉన్న 50 ఎకరాల భూమిని రూ.5000 కోట్లకు అమ్మడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దళిత, బడుగు బలహీన వర్గాలకు చెందిన రైతులు సాగుచేసుకునే భూములను వారికే పట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. గోశాల ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని.. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో, అటవీ భూముల్లో ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, పార్టీ మండల మాజీ అధ్యక్షులు గున్నాల గోపాల్‌రెడ్డి, మోర నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ రత్నం, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు శోభ, ఓబీసీ మోర్చా నియోజకవర్గం కన్వీనర్ వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

- కబ్జాకు గురైతే సమాచారం ఇవ్వండి
- దేవాదాయ శాఖ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్



ఆలయాన్ని సందర్శించి మాట్లాడుతున్న చంద్రశేఖర్

కుల్కచర్ల: ఆలయ భూములను ఆక్రమించినా, క్రయ విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తప్పవని దేవాదాయ శాఖ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. సోమవారం మంత్రి కొండా సురేఖ పర్యటనలో భాగంగా పాంబండ ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఎవరైనా దేవాలయ భూములను ఆక్రమిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, అట్టి భూములను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఇటీవల కబ్జాకు గురైన తాండూరు సోమేశ్వర స్వామి ఆలయ భూమి(5 ఎకరాల 27గుంటలు)ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 467 ఆలయాలకు 15,779 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. అర్చకుల ఆధీనంలో 4,740 ఎకరాలు ఉండగా, 2,302 ఎకరాలు కౌలుకు ఇచ్చినట్లు తెలిపారు. కౌలు ద్వారా రూ.60 లక్షల ఆదాయం వస్తోందన్నారు. సాగుకు యోగ్యం కాని భూములు 3,035 ఎకరాలు ఉన్నాయని, మరో 4,481 ఎకరాలకు సంబంధించి కోర్టుల్లో కేసులు నడుస్తున్నట్లు చెప్పారు. ఆలయాల అభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు ప్రణీత్‌కుమార్, శాంతకుమార్, రాజేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, బాలనర్సయ్య, పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

రంగారెడ్డి డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయంజాల్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్‌లోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనమహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు, మాజీ కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ, నాయకులు తాటిచెట్టు అశోక్ గౌడ్, తూళ్ల నర్సింహ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు గౌని రాజు గౌడ్, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం రద్దుకు బీజేపీ కుట్ర

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

అనంతగిరి: భారత రాజ్యాంగంలో సెక్యులరిజం సోషలిజం పదాలు రాజ్యాంగ మూల స్తంభాలేనని, ఆ పదాలను తొలగించాలని ఆర్‌ఎస్‌ఎస్ నేతలు వ్యాఖ్యానించడం దేశ ప్రజలందరినీ అవమానించడమేనని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు అన్నారు. సోమవారం వికారాబాద్ సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కేవీపీఎస్ జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోషలిస్ట్ సెక్యులర్ పదాలను తొలగించాలని ప్రయత్నిస్తే ఊరుకోబోమన్నారు. రాజ్యాంగం రద్దుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఈ కుట్రలను నేటితరం ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను లేకుండా చేసి మత రాజ్యాంగ మార్చాలని కుట్ర చేస్తోందని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అట్టడుగు వర్గాలపై జరుగుతున్న ఈ అమానవీయ సంఘటనలను అందరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం శోభన్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాపోలు మహిపాల్, జిల్లా అధ్యక్షుడు మల్కయ్య, నాయకులు నవీన్, సురేష్, బ్యాగారి మొగులప్ప, మంతటి సురేష్, పకీరప్ప, హన్మంతు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు మేలు

- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తదితరులు

షాబాద్: రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. మండల పరిధిలోని పెద్దవేడులో రైతు పీసరి అనిత సురేందర్‌రెడ్డి పొలంలో చేపట్టిన ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పది ఉమ్మడి జిల్లాల్లో ఆయిల్‌పామ్ కంపెనీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నగరానికి ఆనుకుని ఉన్న రంగారెడ్డి జిల్లా పచ్చగా ఉంటేనే తెలంగాణ మొత్తం పచ్చబడుతుందని పేర్కొన్నారు. రైతులు సాగు చేసే పంటలకు కావాల్సిన డ్రిప్ పరికరాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ఎకరానికి ప్రభుత్వమే రూ.51వేలు ఖర్చులకు అందిస్తుందని చెప్పారు. గుడిమల్కాపూర్ మార్కెట్‌ను అజీజ్‌నగర్‌లో ఏర్పాటు చేయాలన్న ఇక్కడి ప్రజల కోరిక మేరకు ముఖ్యమంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ యస్మిన్‌భాషా, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సురేశ్, డీసీఓ సుధాకర్, చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, పాల్యూషన్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఉద్యానవనశాఖ అధికారులు, ఎంపీటీసీ మాజీ సభ్యులు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

17న లయన్స్ క్లబ్ ఇన్‌స్టాలేషన్

క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ట



కొడంగల్: కొడంగల్ పట్టణ లయన్స్ క్లబ్ ఇన్‌స్టాలేషన్‌ను ఈ నెల 17న(గురువారం) సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ట తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా లయన్ నటరాజ్, ముఖ్య అతిథులుగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్ రెడ్డి, జిల్లా సెకండ్ వైస్ గవర్నర్ లయన్ శశికాంత్, ఇండక్షన్ అధికారిగా లయన్ మృత్యుంజయ, ఇన్‌స్టాలేషన్ కమిటీ చైర్మన్‌గా ముద్దప్ప దేశ్‌ముఖ్ వ్యవహరిస్తారని చెప్పారు. క్లబ్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వేలాది మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్



సీజ్ చేసిన టిప్పర్లు

దోమ: అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్న వాహనాలను టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం రాత్రి పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ అన్వర్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఊటుపల్లి గ్రామ సమీపంలో కొందరు టిప్పర్లలో మట్టిని నింపి యథేచ్ఛగా తరలిస్తున్నారని సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో కలిసి అక్కడి చేరుకొని ఐదు టిప్పర్లు, ఓ జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను స్థానిక పోలీసులు సీజ్ చేసి ఏడుగురిపై కేసు నమోదు చేశారు. అక్రమ మట్టి వ్యాపారం చేస్తే ఉపేక్షించేది లేదని టాస్క్‌ఫోర్స్ సీఐ హెచ్చరించారు.

ఆర్‌ఐగా అదనపు బాధ్యతలు

ధారూరు: మండల ఆర్‌ఐగా దేవేందర్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆర్‌ఐ స్వప్న పర్యవేక్షిస్తున్న ధారూరు, నాగారం, అంపల్లి, గురుదోట్ల, దోర్నాల్, హరిదాస్‌పల్లి, కొండాపూర్‌కలాన్, గడ్డమీదిగంగారం, నర్సాపూర్, రాజాపూర్, నాగసమందర్, అల్లిపూర్, రుద్రారం, ఎబ్బనూర్, మోమిన్‌కలాన్, తరిగోపుల, కుక్కింద, ధర్మాపూర్ గ్రామాలను అతనికి కేటాయించినట్లు తహసీల్దార్ సాజిదా బేగం తెలిపారు. మున్నూరుసోమారం, రాంపూర్‌తండా, నాగ్‌సాన్‌పల్లి, అవుసుపల్లి, మైలారం, మోమిన్‌ఖుర్దు, కుమ్మర్‌పల్లి, కొండాపూర్‌ఖుర్దు, కేరెల్లి, అల్లాపూర్, అంతారం, బూర్గుగడ్డ, చింతకుంట, బాచారం, గట్టెపల్లి కాచారం గ్రామాలను ఆర్‌ఐ స్వప్న పర్యవేక్షిస్తారన్నారు.

పొలాల్లోకి పశువులను వదలొద్దని ఫిర్యాదు

చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆశ్రయించిన రైతులు



ధారూరు పీఎస్‌కు వచ్చిన రైతులు

ధారూరు: మండల కేంద్రంలోని కొంతమంది పశువుల వ్యాపారులు మేత కోసం మూగజీవాలను పంట పొలాల్లోకి వదులుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం వారు సేకరించిన ఫొటోలు, వీడియోలను సీఐ రఘురామ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం పత్తి, మొక్కజొన్న కంది పంటలు వేశామని వ్యాపారులు పశువులను వదిలేయడంతో పంటలు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే పశువులను పట్టుకుని జరిమానా విధిస్తామన్నారు. తిరుపతిగారి మల్లేశం తన పంట పొలాన్ని వ్యాపారుల పశువులు నాశనం చేశాయని ఎస్‌ఐ అనితకు ఫిర్యాదు చేశారు.

తప్పిపోయిన మహిళ.. స్నాప్‌చాట్‌తో ఆచూకీ

మీర్‌పేట: ఏడాది క్రితం అదృశ్యమైన మహిళ కేసును మీర్‌పేట పోలీసులు 'స్నాప్‌చాట్' ద్వారా ఛేదించారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. అల్మాస్‌గూడ వినాయకహిల్స్‌లో నివాసముండే ఓ మహిళ(22) కుటుంబ వివాదాల కారణంగా గతేడాది జూన్ 8వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి పోయింది. దీంతో ఆమె భర్త పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మహిళ ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు సెల్‌ఫోన్ కానీ, ఆమెకు సంబంధించి ఎలాంటి ఆధారాలు వెంట తీసుకెళ్లకపోవడంతో కేసును సవాలుగా తీసుకున్న మీర్‌పేట పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సదరు మహిళ మరొకరి సెల్‌ఫోన్‌లో స్నాప్‌చాట్ ఐడీని సృష్టించినట్లు పోలీసులు గుర్తించారు. సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా మహారాష్ట్ర ముంబయిలో ఆమెను అదుపులోకి తీసుకుని సోమవారం తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అక్కడికి ఎందుకు వెళ్లిందనే విషయంపై స్పష్టత లేదు.

ఫోన్ చోరీ.. ఖాతా ఖాళీ

హెచ్చుమీరుతున్న సైబర్ నేరాలు

- అమాయకులే లక్ష్యంగా కేటుగాళ్ల కొత్తపంథా
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన



మోమిన్‌పేట: బస్సులు, సంతలలో ఫోన్‌లను చోరీ చేయడం ఆపై డబ్బులు లాగేసుకోవడం ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న కొత్త విధానం. ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీలు జరపడంతో కేటుగాళ్లు చోరీల కోసం నూతన దారులు అన్వేషిస్తున్నారు. ఇలాంటి ఘటనలు మండల సర్కిల్ కార్యాలయ పరిధిలో గడిచిన రెండేళ్లలో 33 ఫిర్యాదు రాగా అందులో 8 కేసులను నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. దాదాపు రూ.10,46,883 సొత్తును రికవరీ చేశారు. ఫోన్ పోగొట్టుకొన్న వెంటనే సిమ్‌ను బ్లాకు చేయాలని పోలీసు అధికారులు పదేపదే చెబుతున్నారు. మరోవైపు అమయాకులు ఆన్‌లైన్ గేమ్‌లు, వాట్సాప్‌లో వచ్చే లింక్‌లను ఓపెన్ చేయడంతో బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బులు మాయమవుతాయి. అప్పుడు వెంటనే 1930కి కాల్ చేయడంతో మాయమైన నగదు ఓల్డ్‌లో పెడుతారని అధికారులు పేర్కొంటున్నారు.

లబోదిబోమన్న బాధితులు

ఇటీవల మోమిన్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్ రషీద్ విధుల్లో భాగంగా వికారాబాద్‌కు వెళ్లాల్సి రావడంతో బస్టాండులో బస్సు ఎక్కాడు. అంతలోనే ఫోన్‌చోరీకి గురైంది. వెంటనే బ్యాంకులకు సమాచారం అందించడంతో డబ్బులు పోలేదు. కానీ ఈ ఏడాది మార్చి 2వ తేదీన మోమిన్‌పేటకు చెందిన రుద్రశెట్టి శివకుమార్ వికారాబాద్ వెళ్లడానికి బస్టాండులో బస్సు ఎక్కాడు. అంతలోనే ఫోన్ అపహరణకు గురైంది. మరుసటి రోజు బ్యాంకులకు సెలవు ఉండటం, బ్యాంకులకు సమాచారం ఇవ్వాలన్న ఆలోచన కూడా అతనికి తెలీదు. దీంతో ఖాతాలలో నుంచి రూ.1.44 లక్షలు విత్‌డ్రా చేశారు. అదే విధంగా మర్పల్లి గ్రామానికి చెందిన రాజు ఫోన్ పోగొట్టుకోవడంతో ఖాతా నుంచి రూ.10లక్షలు మాయమయ్యాయి. డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన పిన్ నంబరును గుర్తించి డబ్బులను కాజేశారు. లబోదిబోమంటూ వారం రోజులకు పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకొన్న పోలీసులు ఇప్పటికే రూ.68వేలు నిలుపుదల చేశారు. ఇలాంటి కేసుల్లో 8 మంది బాధితులకు డబ్బులను సీఐ వెంకట్ వారి ఖాతాలలో జమ చేయించారు. సైబర్ నేరగాళ్లు ఏ విధంగానైనా డబ్బులు కాజేసేందుకు అనేక రకాలుగా ప్రయత్నిస్తూనే ఉంటారని పేర్కొన్నారు.

ఆశ్చర్యానికి గురయ్యా



ఫోన్ చోరీకి గురైందన్న బాధలోనే ఉన్నా. సిమ్‌ను బ్లాక్ చేయించాను. కానీ అప్పటికే ఖాతాలో ఉన్న డబ్బులను కాజేశారు. బ్యాంకులకు సమాచారం ఇవ్వాలనే విషయం తెల్వదు. బ్యాంకులో సురక్షితంగా ఉంటాయని భ్రమపడ్డా. ఫోన్ పోయిన డిజిటల్ లావాదేవీలకు సిక్రెట్ పిన్ ఉంటదిగా అనుకొన్నా. దాన్ని కనుగొన్నారంటే ఆశ్చర్యానికి గురయ్యా. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తిరిగి డబ్బులు వచ్చాయి. **– శివకుమార్, బాధితుడు, మోమిన్‌పేట**

విద్యార్థులకు గుడ్డు ఇవ్వాల్సిందే

ఏంఈఓ వెంకటయ్య

సాక్షి ఎఫెక్ట్..

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనంలో కోడి గుడ్డు ఇవ్వాల్సిందేనని తాండూరు ఎంఈఓ వెంకటయ్య స్పష్టం చేశారు. ఇటీవల సాక్షి దినపత్రికలో 'నెల రోజులుగా గుడ్డు లేదు' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై విద్యాశాఖ అధికారులు స్పందించారు. సోమవారం ఉన్నతాధికారుల సూచన మేరకు ఏంఈఓ వెంకటయ్య చెన్‌గేస్‌పూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు నిబంధనలు పాటించాలన్నారు. వారానికి మూడు రోజులు విద్యార్థులకు గుడ్డు అందజేయాలన్నారు. అలాగే నాణ్యమైన భోజనం అందించాలని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తానని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీధర్, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న ఏంఈఓ వెంకటయ్య

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

- రేగడిమైలారం శివారులో ప్రమాదం
- తండ్రీ కొడుకులకు గాయాలు



ఘటనా స్థలం వద్ద ఆగివున్న లారీ

బొంరాస్‌పేట: మండల పరిధిలోని జాతీయ రహదారి163 పక్కన ఆగి ఉన్న లారీని.. వేగంగా వెళ్తున్న బైక్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న తండ్రీకొడుకులు తీవ్ర గాయాలపాలయ్యారు. దౌల్తాబాద్ మండలం పోచమ్మగడ్డతండాకు చెందిన సబావత్ నెహ్రూనాయక్, తనకొడుకు అరుణ్‌తో కలిసి సోమవారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై కొడంగల్ వైపు వెళ్తున్నాడు. రేగడిమైలారం శివారు బాపనోనిబావి వద్ద మరమ్మతులకు గురై, రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీ కొట్టడంతో కిందపడ్డారు. ఈ ఘటనలో తొమ్మిదేళ్ల అరుణ్ కాలు విరగగా, నెహ్రూనాయక్ తలకు గాయాలయ్యాయి. స్థానికులు వీరిని కొడంగల్ ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమమని తేల్చినా..

- కొనసాగుతున్న నిర్మాణం
- కబ్జాదారు బరితెగింపు

బషీరాబాద్: జుంటివాగు ప్రభుత్వ భూమి కబ్జాపై ఉరుకులు పరుగులు పెట్టిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అంతలోనే నీరసించారు. మాచనూరు రెవెన్యూ పరిధిలోని జుంటివాగు భూమి కబ్జాకు గురైనట్లు ఈ నెల 9న ఇరిగేషన్ డీఈ క్రిష్ణయ్య, యాలాల తహసీల్దార్ వెంకటస్వామి తేల్చిన విషయం విదితమే. ఎంత భూమి కబ్జా అయ్యిందో సర్వే చేసి హద్దులు పాతారు. అయితే ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన సదరు వ్యక్తి అధికారులు పాతిన హద్దులను సోమవారం చెరిపేశాడు. అలాగే కబ్జా చేసిన 20 గుంటల ప్రభుత్వ భూమిలో గదుల నిర్మాణం కూల్చివేయాలని అధికారులు ఆదేశించినా పట్టించుకోకుండా పనులు కొనసాగిస్తున్నాడు. సదరు భూ కబ్జాదారుపై అధికారులు చర్యలకు వెనకడుగు వేశారని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.



కబ్జా భూమిలో కొనసాగుతున్న ఇంటి నిర్మాణం

నేడు ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకు థారాసింగ్

తాండూరు: ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ పీసీసీ ప్రధాన కార్యదర్శి, పెద్దేముల్ మాజీ జెడ్పీటీసీ జాదవ్ థారాసింగ్‌కు జూబ్లీహిల్స్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు తాను విచారణకు హాజరవుతానని ఆయన తెలిపారు.

ఏఈఓకు మెమో

సాక్షి ఎఫెక్ట్..

దోమ: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఫార్మర్ రిజిస్ట్రీని వ్యవసాయ విస్తరణ అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారని సోమవారం 'సాక్షి'లో దినపత్రికలో ఫార్మర్ రిజిస్ట్రీకి పైసా వసూల్ అనే కథనం ప్రచురితమయింది. ఇందుకు స్పందించిన ఉన్నతాధికారులు ఏఈఓ హారికకు మెమో జారీ వివరణ తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావుకు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఆయన ఏఈఓ హారికకు మెమో ఇచ్చి ఫార్మర్ రిజిస్ట్రీ ఆరోపణలపై రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలన్నారు. లేని పక్షంలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నర్సింలు (ఫైల్)

చేవెళ్ల: ముందు వెళ్తున్న కారు సడెన్ బ్రేక్ వేయటంతో వెనకనుంచి బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చనువెళ్లి గ్రామానికి చెందిన తలారి నర్సింలు(38) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి తన బైక్‌పై చేవెళ్లకు వెళ్తుండగా పామెన బస్‌స్టేజి సమీపంలోని పెట్రోల్ బంకు సమీపంలో ముందు వెళ్తున్న కారు డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో నర్సింలు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి ఎగిరి కిందపడి తీవ్రంగా గాయపడిన నర్సింలును చేవెళ్లలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య నలుగురు పిల్లలు ఉన్నారు. పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్‌కే ప్రజల మద్దతు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

చేవెళ్ల: రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ పాలనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి అన్నారు. నగరంలోని ఆమె నివాసంలో సోమవారం మండలంలోని ముడిమ్యాలకు చెందిన కాంగ్రెస్‌పార్టీ నాయకులు, యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసుగు చెందిపోయారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయటంతో పూర్తిగా విఫలమయ్యారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల పని రాష్ట్రంలో అయిపోయిందని మళ్లీ బీఆర్‌ఎస్ పాలనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. అందుకే వలసలు పెరుగుతున్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీ పోటీ చేసి సత్తాను చాటుకుంటుందన్నారు. పార్టీలోకి వచ్చిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ క్రిష్టారెడ్డి, నాయకులు ఆంజనేయులు, ప్రభాకర్, నారాయణ, రాజు, శశిపాల్, వెంకటేశ్, క్రిష్ణ, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మరోపక్క చేవెళ్లలోని పార్టీ కార్యాలయం వద్ద రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి సమక్షంలో రేగడిఘనాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.



ఎమ్మెల్యే సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన నాయకులు

పర్యవేక్షణే పరమావధి

- మధ్యాహ్న భోజనంపై అప్రమత్తత ముఖ్యం
- నిర్వాహకులకు బిల్లులు విడుదల చేయాలి
- ప్రభుత్వానికి విద్యార్థుల తల్లిదండ్రుల సూచన



దౌల్తాబాద్‌లో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

దౌల్తాబాద్: మధ్యాహ్న భోజన మెనూ బాగున్నా అమలులో ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యావసరాల ధరల పెరుగుదలతో గిట్టుబాటు కాక విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం ఏజెన్సీ వారికి కష్టమవుతుంది. గతేడాది రాష్ట్రంలోని పలు గురుకులాల్లో ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనం వికటించి పిల్లలు అస్వస్థతకు గురికావడంతో అంతటా అధికార యంత్రాగాన్ని అప్రమత్తం చేశారు. అప్పట్లో నోడల్ అధికారులను నియమించి పర్యవేక్షించారు. ఈ విద్యా సంవత్సరం తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాధ్యతే ముఖ్యం

అనేక బడుల్లో కొంతకాలంగా ఆహార కమిటీల పాత్ర అంతంతమాత్రంగానే ఉంది. కొన్ని బడుల్లో నేరుగా విద్యార్థులకు భోజనం వడ్డిన్నారు. అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుల పర్యవేక్షణ కూడా కొన్ని చోట్ల సరిగ్గా ఉండడంలేదు. ఈ క్రమంలో జిల్లా యంత్రాంగం ముందుగానే అప్రమత్తమైతే మేలు. బడిలో వంట చేసే పాత్రలు ఎలా ఉన్నాయో.. సరి చూడాలి. వండిన భోజనాన్ని మొదట ఇద్దరు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు రుచి చూడాలి. వీరు భోజనం రుచి చూసిన తర్వాతనే మిగతా వారికి అందించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడు నాణ్యమైన ఆహారం విద్యార్థులకు అంది అస్వస్థతకు గురికాకుండా ఉంటారు.

నిధులు పెంచాలి

దౌల్తాబాద్ మండల పరిధిలోనూ మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు అంతంతమాత్రంగానే ప్రభుత్వం ధరలు అందిస్తుంది. మరోవైపు బకాయి బిల్లులు చెల్లింపులకు నోచుకోక నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. దీని ప్రభావం వంట తయారీపై పడే అవకాశం ఉంటుంది. అలా కాకుండా నిధులు పెంచితే పిల్లలకు నాణ్యమైన భోజనం అందే వీలుంటుంది. ఈ విషయమై ఎంఈఓ వెంకట్ స్వామిని వివరణ కోరగా ఇప్పటికే బడుల్లో మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణ పెంచామన్నారు. బడుల్లో మెరుగైన మెనూ అమలయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు.

బస్సులు ఆపాలని రాస్తారోకో

విద్యార్థుల నిరసనతో రోడ్డుపై నిలిచిన వాహనాలు



రోడ్డుపై రాస్తారోకో నిర్వహించిన విద్యార్థులు

పూడూరు: హైదరాబాద్- వికారాబాద్ ప్రాంతాలకు బస్సులు నడుస్తున్నా మండలంలోని అంగడి చిట్టంపల్లి గేటు వద్ద ఎందుకు ఆపడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజులుగా విసుగు చెందిన యువజన సంఘాల నాయకులతో కలిసి చిన్నారులు సోమవారం ఉదయం హైదరాబాద్-బీజాపూర్ హైవేపై రాస్తారోకో నిర్వహించారు. బస్‌పాసులు తీసుకుని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కానీ బస్సుల మాత్రం ఇక్కడ ఆపడం లేదని వాపోయారు. ఈ మేరకు విసుగు చెందిన కొకుంట్ల, అంతారం, అంగడిచిట్టంపల్లి, చన్గోముల్ గ్రామాలకు చెందిన విద్యార్థులు రోడ్డుపై బస్సులను ఆపి ఆందోళన చేపట్టారు. ఎందుకు ఆపడంలేదని ప్రశ్నించారు. పోలీసులు చేరుకొని ఆర్టీసీ అధికారులతో మాట్లాడడంతో వివాదం సద్దుమణిగింది.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

- తల్లిదండ్రులు మందలించారని మనస్తాపం
- హస్నాబాద్‌లో విషాదం



నవీన్ (ఫైల్)

దుద్యాల్: తల్లిదండ్రులు మందలించారనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండల పరిధిలోని హస్నాబాద్‌లో సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, కొడంగల్ ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన చాకలి వెంకటమ్మ, ఇస్వప్పకు ముగ్గురు కుమారులు. వ్యవసాయం చేసుకునే తల్లిదండ్రులకు పెద్ద కుమారుడు నవీన్(24) చేదోడువాదోడుగా ఉండేవాడు. ఇటీవల తన బైక్‌పై గుజరాత్, అరుణాచలంతో పాటు ఇతర సుదూర ప్రాంతాలకు వెళ్లి వచ్చాడు. ఈ విషయమై తల్లిదండ్రులు అతన్ని మందలించారు. బైక్‌పై వందల కిలోమీటర్ల ప్రయాణం సురక్షితం కాదని, ప్రమాదాలు జరిగే అవకాశంతో పాటు ఆరోగ్యం పాడవుతుందని చెప్పారు. పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల పేరుతో మరోసారి బైక్‌పై వెళ్లొద్దని సూచించారు. దీంతో మనస్తాపానికి గురైన నవీన్ సోమవారం ఉదయం పొలానికి వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. చేతికి వచ్చిన చెట్టంత కొడుకు ఇలా చేస్తాడని ఊహించలేదని బాధిత తల్లిదండ్రులు రోదించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



శ్రీకాంత్ (ఫైల్)

దోమ: సాగులో వాడే క్రిమి సంహారక మందు తాగి ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వెంకటయ్య, బాలమణి దంపతులకు శ్రీకాంత్(27) ఏకైక కుమారుడు. అతను కొంత కాలంగా కడుపునొప్పితో తీవ్రంగా బాధపడుతూ ఇబ్బందులకు గురవుతుండేవాడు. దీంతో మనస్తాపం చెందిన ఆయన ఈ నెల 12వ తేదీ రాత్రి ఊటుపల్లి గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పురుగుల మందు తాగాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి నగరంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు డిగ్రీ వరకు పూర్తి చేసి కుటుంబ సభ్యులకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యాంతమయ్యారు.

దశలవారీగా అభివృద్ధి పనులు

మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి



మురుగు కాలువ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్, కాంగ్రెస్ నాయకులు

తాండూరు టౌన్: తాండూరు మున్సిపల్ పరిధిలో దశల వారీగా పలు అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి అన్నారు. సోమవారం సాయిపూర్ 9వ వార్డు పరిధిలోని కుమ్మరికుంటలో రూ.5 లక్షలతో మురుగు కాలువ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డులను సుందరీకరించుటలో భాగంగా పలు సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో జనావాసాల మధ్య వరదనీరు, మురుగునీరు నిలవకుండా ఉండేందుకు సైడ్ డ్రైన్‌లను నిర్మించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సహకారంతో పలు అభివృద్ధి పనులు చకాచకా జరుగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు బంటు వేణుగోపాల్, బంటు మల్లప్ప తెలిపారు.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు



స్తంభానికి ఇలా ప్రమాదకరంగా..

అల్లుకున్న ప్రమాదం

దుద్యాల్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ నిండుకున్న పిచ్చి మొక్కలతో ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మండల పరిధిలోని హకీంపేట్‌లో గ్రామానికి సరఫరా అయ్యే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయి బుడ్డీలు కనిపించకుండా పోయింది. వర్షాకాలం కావడంతో సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే మరమ్మతులు చేయడానికి కష్టంగా అవుతుంది. అధికారులు స్పందించి వెంటనే పిచ్చిమొక్కలను తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.